గుత్తుల భాస్కరరావు

# కలిసీ కలియని మనసులు



అంతకంతకూ విష్ణుమూర్తి పరిస్థితి ఆందోళన కలిగించసాగింది. అతను ఉదయం పదింటికి మొదలెట్టిన పిచ్చి పనులు, ఉన్మాద చేష్టలు సాయంత్రం ఆరైనా మానలేదు.

గిన్నెలు విసిరాడు. చెంబులు విసిరాడు. అందర్నీ కసిరాడు. పుస్తకాలు ఎగరేసి చిందర వందర చేశాడు. బీర్వాల్లో బట్టలు కెలికి గచ్చుమీద పారేశాడు. అడ్డొచ్చినా నోరెత్తినా చెల్లెళ్ళని తమ్ముళ్ళని చితక బాదేశాడు. దెబ్బలు తిని స్వతంత్రంగా వాళ్ళని ఏడ్వనివ్వ

కుండా అరిచి నోరు నొక్కేశాడు. తలుపుని తన్ని గడ విరగ్గొట్టాడు. ఇంకుసీసా విసిరి నేలమీద చిత్రకళ సృష్టించాడు. పెన్ను మూత తీసి పాళీ వంగిపోయేలా నిలువుగా వదిలాడు, భోజనానికి పిలిస్తే "మీరే తిని చావండి" అని ఎగిరాడు. బతిమాలగా చివరికి భోజనం ముందు కూర్చొని "ఇది వంకాయ వేపుడా-వల్లకాడు వేపుడా" అని కంచం ఎత్తి గిర్వాటేశాడు. ఇంకా ఎన్నో......

'చిన్నాడా...చితకాడా... కాలేజీలో చదువుతున్నాడు కూడా" అని బుగ్గలు నొక్కుకున్నారు నైబర్లు.

విష్ణుమూర్తి తల్లిదండ్రులకి గాభరా కలిగింది. "ఇది పిచ్చిగాక మరేమిటి" అని భయపడ్డారు. రమణయ్యగారు యిక లాభం లేదనుకుని రిక్షా పిలిపించారు. యిరుగు పొరుగు సాయంతో కొడుకు రెక్కలు విరిచికట్టి రిక్షాలో పడవేశారు. "కొత్తపేట పోనియ్" అన్నాడు. పిచ్చాసుపత్రిలో డాక్టరుచేసి రిటైరయిన తెలిసినాయన ఒకాయన కొత్తపేటలో ఉంటున్నాడు. గింజుకుని గింజుకుని విష్ణుమూర్తి అలుపొచ్చి రిక్షా బాడీలో లొంగి పడుకుని చొంగ కార్చసాతాడు.

సోలిపోయిన కొడుకుని రిక్షావాడి సహాయంతో డాక్టరుముందు హాజరుపరిచారు రమణయ్యగారు.

డాక్టర్-విష్ణుమూర్తి కట్లు విడిపించి కదిపి కుదిపి నిల్చోబెట్టి కూర్చోబెట్టి పడుకోబెట్టి-వంగోబెట్టి-చొక్కా విడిపించి మళ్ళా తొడిగించి-ఉన్నట్టుండి లాగి లెంప పగలేసి - యిలా రకరకాలుగా పరీక్షించి,

"దోషమేమీలేదు. ఇతను ఆరోగ్యంగా ఉన్నాడు," అని ప్రకటించాడు.

రమణయ్యగారు నిరుత్సాహపడి "అది కాదు సార్" అంటూ కొడుకు పొద్దుట్నుంచీ కదను తొక్కిన విధానం కళ్లకు కట్టినట్టు చెప్పారు.

డాక్టరు చివుక్కున కళ్ళజోడు లాగి "ఐ సీ" అన్నాడు. అటూ ఇటూ తల పంకించాడు. నోరు తెరిచి కళ్ళజోడు కాలు పళ్లమీద మీటుకుని "యితను ఎప్పట్నుంచి అలా ప్రవర్తించాడు" అని ప్రశ్నించాడు.

"ఉదయం సుమారు పదిగంటల్నుంచి"

"అపుడు ఏదో సంఘటన జరిగింది. దాని ప్రభావం యిది."

"ఏవీ జరిగినట్టు లేదండి."

"బాగా గుర్తు తెచ్చుకొండి. మీ కుర్రాడితో ఆ సమయంలో ఎవరైనా మాట్లాడారా ?"

"లేదండి. పోస్టుమన్ మాత్రం వచ్చాడు."




"పోస్టుమన్ వచ్చాడా? మీకు ఉత్తరాలు ఎక్కడెక్కడ్నుంచి వచ్చాయి?"

"ఉత్తరాలేం రాలేదండి."

"ఉత్తరాల్లేకుండా పోస్టుమన్ మీ గుమ్మం ఎందుకు తొక్కినట్టు?"

"నిజమే సర్. మాకూ తట్టలేదు".

"కాబట్టి ఏవో ఉత్తరాలు వచ్చాయి. మీ వాడు చదివి దాచేశాడు."

"ఆ రకం మనిషి కాడండీ"

"లవ్ లెటర్ కావచ్చు. ఏ అమ్మాయో మీ వాడికి మొండిచెయ్యి చూపించి ఉంటుంది."

"శివశివా. ఆడశబ్దానికి వాడు ఆమడ దూరాన్నుంటాడండి."

"అలాగా.........పోనీ మీ వాడికి కథలు రాసే అలవాటుందా?"

ఈ ప్రశ్నకి ఆ తండ్రి మొహంలో ఫ్యూజ్ కొట్టేసినపుడు పుట్టే వెలుతురు కనిపించింది. "అవునండోయ్. కథలూ అవీ గెలుకుతుంటాడు."

"పోయి చూసుకోండి మీ వాడి కథేదో తిరిగి వచ్చింది" అన్నాడు వెనక్కివాలి.

ఆ ఘళాన రమణయ్యగారు కొడుకునీ డాక్టరినీ వదిలి యింటికి పరిగెత్తి చూస్తే ఏముంది?.........

పరుపుకింద-తిరిగొచ్చి-ఏమీ ఎరగనట్టు పడుంది-కొడుకు రచన "కలిసీ కలియని మనసులు" కాటా వేస్తే కేజీ తూగుతుంది. హామీ పత్రంకూడావుంది. "యిది నా సొంత రచన. దేనికీ కాపీ కాదు. నన్ను నమ్మండి. ఒట్టు!" అంటూ.